సాక్షి జనగామ

బుధవారం | 4 | అక్టోబర్ | 2023



గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలి - 8లో▸

అర్చకులు గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలని దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ శ్రీకాంతారావు తెలిపారు.



కేయూలో బంద్ ప్రశాంతం

విద్యార్థి జేఏసీ ఇచ్చిన కేయూ బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. వీసీ రమేశ్‌ను బర్తరఫ్ చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

33^0 / 22^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉండి సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

లీకేజీకి మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

తరిగొప్పుల: అధికారుల పర్యవేక్షణ లోపంతో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఏర్పడి పంట పొలాల్లోకి నీరు చేరడం, తాగునీరు వృథా అవుతున్న తీరుపై ప్రతీసారి ఇదే తంతు శీర్షిక ఆదివారం సాక్షిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మిషన్ భగీరథ అధికారులు సిబ్బందితో మండలకేంద్రం శివారు ఎన్యానాయక్‌తండా వద్ద ఏర్పడిన లీకేజీని అరికట్టేందుకు మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోకుండా పైపులైను లీకేజీకి మరమ్మతులు పూర్తిస్థాయిలో చేసి తాగునీరు సరఫరా అయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'మా భూములు లాక్కోవద్దు'



జనగామ: పాలకుర్తిలో దళితులకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను లాక్కోవద్దని మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ రవీందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం బహుజన కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు గుమ్మడి రాజుల సాంబయ్య, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా సంఘీభావం తెలిపి దళిత కుటుంబాలతో మాట్లాడారు. యాభై ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను ప్రస్తుత ప్రభుత్వం తిరిగి తీసుకోవాలని చూస్తుందన్నారు. యాభై కుటుంబాలకు పైగా ఈ భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఆయా కుల సంఘాలు, ఫంక్షన్ హాల్స్, పలు దేవాలయాల నిర్మాణం కోసం దళితుల భూములు తీసుకోవాలనే ప్రయత్నం విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడవల్లి సోము, గాదెపాక సూరమ్మ, గాయాల నాగమణి, గాదెపాక ఎల్లమ్మ, గాయాల మంజుల, గాయాల సమ్మయ్య, గాదెపాక సోమన్న తదితరులు ఉన్నారు.

'వలస వాదుల వైఖరితో ఉపాధి కోల్పోతున్నాం'



రఘునాథపల్లి: రాజస్తాన్, ఏపీ, బీహార్ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వైఖరితో తాము ఉపాధి కోల్పోతున్నామని గ్రానైట్, టైల్స్, మార్బుల్ నియోజకవర్గ యూనియన్ కార్మిక నాయకులు మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రానైట్, మార్బుల్, టైల్స్ కార్మికులుగా తాము జీవనం సాగిస్తుండగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు తక్కువ ధరకు పని చేస్తూ తమ పొట్టకొడుతున్నారన్నారు. యూనియన్ నిబంధనల మేరకు పని చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఇందుకు సహాయ సహకారాలు అందజేయాలని విజ్ఞప్తి చేయగా సీఐ సానుకూలంగా స్పందించారని యూనియన్ కార్మిక నాయకులు తెలిపారు. సీఐని కలిసిన వారిలో యూనియన్ నాయకులు బొజ్జ రాజు, దామెర రాజు, మునిగెల రామన్న, సమ్మయ్య, సముద్రాల రాజు, ముక్కెర రాజు, షాన్‌పాషా, మనిరాజు ఉన్నారు.

జాతీయ స్థాయికి ఎంపిక




జనగామ రూరల్: ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన సౌత్ జోన్ స్టేట్ లెవల్ టోర్నమెంట్‌లో పట్టణంలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ అఫ్జల్ ఎంపికైన వారిని అభినందించారు. అండర్ 18 హమ్మర్ త్రోలో జగదంపల్లి రౌణక్ తృతీయ స్థానంలో నిలవగా అండర్ 16లో సునిత్ కుమార్ షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం పొంది గోల్డ్ మోడల్ సాధించాడు. ఈనెల 20న సూర్యాపేటలో జరగనున్న నేషనల్ మీట్‌లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్ ఇన్‌చార్జ్ మరిపెల్లి రవిప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబర్చి మంచి గుర్తింపును తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వస్కూల శ్రీనివాస్, శేఖర్, నందిని పటేల్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక స్కూళ్లలో ల్యాబ్‌లు

- రూ.1.25కోట్లతో పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలల నిర్మాణం
- మూడు మోడల్ స్కూళ్లలో మరమ్మతు పనులు
- 'పీఎం శ్రీ' పథకంలో ఎంపికైన పాఠశాలలు



కొడకండ్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



జనగామ: ప్రభుత్వ బడుల్లో చదువుకునే పేద విద్యార్థులకు నేటి పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధన అందించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కలిసి 'పీఎం శ్రీ' (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి నాంది పలికారు. ఈ పథకం ద్వారా జిల్లాలోని పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు, మోడల్ స్కూల్స్‌ల మరమ్మతుకు నిధులను మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకంలో ఎంపిక చేసిన పాఠశాలలకు నిధులు విడుదల చేసింది. బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం విడుదల చేసే నిధులు 60 శాతం ఉండగా, మిగతా 40 శాతాన్ని రాష్ట్రం సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఈ నిధుల ద్వారా స్కూల్స్‌ను అప్‌గ్రేడ్ చేసి అద్భుతంగా తీర్చిదిద్దాలనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్న సర్కారు బడులను పీఎం శ్రీ పథకానికి ఎంపిక చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలను పెంపొందించేలా ఈ స్కీంను రూపకల్పన చేశారు. విద్యార్థుల ప్రతిభకు మరింత పదును పెట్టి, పాఠశాల దశలోనే వారిలోని ప్రతిభను వెలికి తీయాలని భావిస్తోంది. జిల్లాలో 103 జిల్లా పరిషత్ ఉన్నత, 64 యూపీఎస్, 341 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఇందులో సుమారు 40 వేల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. పీఎం శ్రీ పథకం ద్వారా మౌలిక వసతి సౌకర్యాలను పెంచి, పాఠశాలలను అత్యాధునికంగా మార్చనున్నారు. పాఠశాలల్లో సంప్రదాయ విధానాలకు స్వస్తి పలికి, నూతన పద్ధతుల్లో బోధన చేసే విధంగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. పాఠ్యాంశాలతో పాటు బోధనా పద్ధతులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. ఫౌండేషనల్, ప్రిపరేటరీ, ఇంటర్మీడియట్, సెకండరీ లెవల్స్‌గా పేర్కొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా..

దేశ వ్యాప్తంగా పాఠశాలల దశ, దిశను మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పీఎం శ్రీ పథకం అమలు చేస్తోంది. జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా పాఠశాలలను అప్‌గ్రేడేషన్‌కు సంకల్పించింది. జనగామ జిల్లాలోని బచ్చన్నపేట మోడల్ స్కూల్, దేవరుప్పుల మండలం కోలుకొండ ఉన్నత, స్టేషన్ ఘన్‌పూర్ మోడల్, జనగామ మండలం చౌడారం మోడల్, పట్టణంలోని ధర్మకంచ ఉన్నత, కొడకండ్ల, పాలకుర్తి ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు ఒక్కో స్కూల్‌కు రూ.16లక్షల చొప్పున రూ.1.12 కోట్ల నిధులను మంజూరు చేసింది. అలాగే బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ మండలం చౌడారం మోడల్ స్కూల్ మరమ్మతుకు ఒక్కో పాఠశాలకు రూ.4.50 లక్షల చొప్పున రూ.13.50 లక్షల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ నిధులతో లేబొరేటరీలు, పరికరాల కొనుగోలు, అత్యాధునిక తరగతి గదులు, ఫర్నిచర్, కంప్యూటర్ బోధించే ఉపాధ్యాయుల నియామకం తదితర వాటిని చేపట్టనున్నారు. టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ విభాగానికి పనుల బాధ్యత అప్పగించగా, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీలు పర్యవేక్షణ చేయనున్నారు.

ఆరు పాఠశాలలు ఎంపిక



ఈ పథకంలో జిల్లాలోని ఆరు పాఠశాలల్లో సైన్స్ ప్రయోగశాలల నిర్మాణం, మూడు మోడల్ పాఠశాలల మరమ్మతు కోసం రూ.1.25 కోట్లు మంజూరు చేశారు. సైన్స్ ల్యాబ్‌ల కోసం రూ.16 లక్షలు, మోడల్ స్కూల్ మరమ్మతు కోసం రూ.4.50 లక్షల చొప్పున కేటాయించారు.

- తోట రాజు, జిల్లా విద్యావిభాగం ప్లానింగ్ కో ఆర్డినేటర్

'కోడ్' వచ్చేస్తోంది!

వారంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

- బీఆర్ఎస్ నేతలకు అధిష్టానం సంకేతాలు
- హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఇక అగ్రనేతల పర్యటనలు.. 6న మంత్రి కేటీఆర్
- ఎన్నికల ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తం

సాక్షిప్రతినిధి, వరంగల్: 'అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈనెలలో వస్తుందంటారా? జమిలీ ఎన్నికలపై నిపుణుల కమిటీ ఏం తేలుస్తోంది. ఇప్పట్లో అది సాధ్యం కాదట కదా..! షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరగకపోతే కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం హైదరాబాద్‌కు ఎందుకు వస్తుంది. కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో కూడా భేటీ అవుతుంది కదా.. త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందట కదా? అలాగైతే షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయన్నమాట' ఎక్కడ నలుగురు కలిసినా.. ఇదే చర్చ. ఇంతకీ ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ ఎప్పుడొస్తాయనే విషయమై ఇంకా స్పష్టత రానప్పటికీ.. షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు జరుగుతాయన్న సంకేతాలు మాత్రం బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అధిష్టానం నుంచి అందినట్లు ప్రచారం జరుగుతోంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సారథ్యంలో 17 మంది సభ్యుల బృందం మంగళవారం హైదరాబాద్‌కు చేరుకోవడం కూడా ప్రచారానికి బలం చేకూరుస్తోంది. దీంతో సర్వత్రా ఎన్నికల షెడ్యూల్‌పైనే చర్చ జరుగుతోంది.

దూకుడు పెంచిన ప్రజాప్రతినిధులు, పార్టీలు

కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో కాలు మోపడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. ఉమ్మడి వరంగల్‌లో అధికార బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు దూకుడు పెంచారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల కోడ్ అమల్లోకి రావొచ్చన్న సంకేతాలతో ఓ అడుగు ముందుకేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు పెట్టుకుంటున్నారు. దీంతో మంత్రులతోపాటు ముఖ్యమంత్రి సహా అగ్రనేతల పర్యటనలతో జిల్లా హోరెత్తనుంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈనెల 6న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ గ్రేటర్ వరంగల్‌లో పర్యటించనున్నారు. హరీశ్, కేసీఆర్ కార్యక్రమాలు కూడా ఉమ్మడి జిల్లాలో ఉండనున్నాయి. అలాగే నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల పర్యటనలు, కార్యక్రమాలను మంగళవారం నుంచి మరింత ముమ్మరం చేశారు. ఇప్పటికే దరఖాస్తులు చేసుకుని టికెట్ల కోసం ఎదురుచూస్తున్న ఆ రెండు పార్టీల అభ్యర్థుల జాబితా కూడా త్వరలోనే వెలువడనుందన్న ధీమాను పార్టీల నేతలు వ్యక్తం చేస్తున్నారు.

సర్వసన్నద్ధంగా అధికార యంత్రాంగం..

గత పోలింగ్ 2018 డిసెంబర్ 7న జరిగింది. ఇందుకోసం నవంబర్ 11న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని అక్టోబర్ 23న ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను ప్రకటించింది. 2023 డిసెంబర్ 13న ప్రభుత్వం రద్దయ్యే అవకాశం ఉన్నందున ఆలోగా.. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వీలుగా ఈసారి కూడా ఎన్నికల షెడ్యూల్ ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికిప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా.. ఎన్నికలు జరిపేలా ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారుగా 27.89 లక్షల పైచిలుకు ఓటర్ల కోసం 3,252 పోలింగ్ కేంద్రాలు, 5,890ల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) సిద్ధం చేసినట్లు కూడా ప్రకటించారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల మార్కింగ్ చేశారు. జిల్లా కలెక్టరేట్లలో ఎన్నికల కేంద్రాలు, మీడియా సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈఏర్పాట్లతో పాటు ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన విధానాలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్‌కు చెందిన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లారు.

సోషల్‌మీడియా వారియర్స్ అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ అప్రమత్తంగా ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ ఆత్మీయ సమావేశాన్ని డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కడియం మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే వారధులు, సారథులు సోషల్ మీడియా వారియర్స్ అన్నారు. అనంతరం సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ వై.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు చేసే ఫేక్ వార్తలను తిప్పి కొడుతూ ప్రజలకు వాస్తవాలను చేరవేసేలా సోషల్‌మీడియా వారియర్స్ అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్నగుప్తా, బూర్ల శంకర్, రాపోలు మధుసూదన్‌రెడ్డి, రాజేష్‌నాయక్, రజాక్‌యాదవ్, చందర్‌రెడ్డి, ఎల్మకంటి నాగరాజు, జీడి ప్రసాద్, శరత్, హఫీజ్, విజయ్, అశోక్, సునీల్, శనబోయిన నాగేష్, ఎం.కిషోర్‌కుమార్, శివప్రసాద్, సంపత్, నర్సింహ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ రూరల్: ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల విభాగం అధికారులతో ముందస్తు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అంచనాల వ్యయం, వీడియో సర్వేలైన్ సిస్టం, అనుమతుల మంజూరు, చెక్‌పోస్టుల నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎన్నికల విభాగానికి సంబంధించి ప్రతి విభాగానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో మాస్టర్ ట్రైడ్ ద్వారా సంబంధిత విభాగానికి అనుసరించాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వోలు మురళీ కృష్ణ, రామూర్తి, అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

జనగామ: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యపై కొందరు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని టీజీఓ అధ్యక్షుడు సింగం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొర్నేలియస్, డాక్టర్ పి.సుగుణాకర్‌రాజు, ట్రెసా కార్యదర్శి పి.రవీందర్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం, రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్, నాన్ గెజిటెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్, సాంస్కృతిక సారథులు, ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాను అన్ని విభాగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న కలెక్టర్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కొంత మంది వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం కలెక్టర్‌పై దుష్ప్రచారం, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లు అమలు చేసి తీరుతాం

రఘునాథపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ లొక్కుంట్ల ప్రవీణ్ అన్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం, కన్నాయపల్లి, గబ్బెటలో ఆరు పథకాల కరపత్రాలను నాయకులతో కలిసి ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్ఎస్ తాము అమలు చేయనున్న పథకాలపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా నాయకులు మేకల నరేందర్, గాదె మహేందర్‌రెడ్డి, లింగాల జోగారెడ్డి, సర్పంచ్ జిట్టబోయిన రాజు, ఎంపీటీసీలు గూడెల్లి శిరీష్‌సురేష్, రచ్చ సోమనాథం, అల్లిబిల్లి కృష్ణ, మాజీ సర్పంచ్ దుబ్బాక చంద్రయ్య, అరవింద్‌రెడ్డి, కల్లెడ పర్వతాలు, కావటి భాస్కర్‌యాదవ్, జీడికంటి రాజ్‌కుమార్, కర్నె అశోక్, పృధ్వీ, అంజయ్య, భిక్షపతి, చంద్రారెడ్డి, బుచ్చిరెడ్డి, మధు, సోమిరెడ్డి, అశోక్, మహేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్‌లోనే ఆధార్ అప్‌డేషన్..!

- డిసెంబర్ 14వరకు ఉచితంగా అవకాశం
- జిల్లాలో 2 లక్షలకు పైగా పెండింగ్



సెంటర్ వద్ద బారులుదీరిన ప్రజలు

జనగామ: ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేషన్ కోసం కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ఎలక్ట్రానిక్స్, ఐటీ విభాగం గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆధార్ సెంటర్లు, ఈ సేవా, పోస్టాఫీసు, బ్యాంకులతో పాటు చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ నుంచి అప్‌డేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. ఫోన్‌లో ఉచితంగా ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రత్యేక వెబ్‌సైట్ క్రియేట్ చేశారు. ఇంట్లో కూర్చుని ఆధార్‌కు సంబంధించిన డాక్యుమెంటేషన్‌ను అప్‌డేషన్ చేసుకునేలా సంబంధిత శాఖలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.జనగామ జిల్లాలోని 12 మండలాల పరిధిలో సుమారు 5.50 లక్షల మంది ఉన్నారు. ఇందులో 2 లక్షల మంది ప్రజలు ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలి. గత కొంత కాలంగా ఈ ప్రక్రియ కొనసాగుతుండగా.. ఇప్పటి వరకు లక్షకు పైగా చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. గత కొన్ని నెలలుగా జిల్లా కేంద్రంతో పాటు మండలాల వారీగా ఆధార్ డాక్యుమెంటేషన్ అప్‌డేట్ కోసం ప్రజలు క్యూ కడుతున్నారు. దీంతో గంటల తరబడి నిరీక్షించడంతో పాటు సర్వర్లు మొరాయిస్తుండడంతో రోజుల తరబడి పనులు వదులుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అప్‌డేషన్ ప్రక్రియను ఎక్కువ మంది సద్వినియోగం చేసుకోవడంతో పాటు సమయం వృథా కాకుండా కేంద్ర ప్రభుత్వం గడువును మరో మూడు నెలల పాటు పొడిగించింది. గత నెల 15వ తేదీ నుంచి 2023 డిసెంబర్ 14వ తేదీ వరకు అప్‌డేషన్ చేసుకోవచ్చని కొత్తగా సర్క్యులర్ జారీ చేసింది.

ఇంట్లో కూర్చుని..

జిల్లాలో 9 ఆధార్ సెంటర్లు, ఒక ఈ సేవా కేంద్రం, పోస్టాఫీస్, బ్యాంకుల్లో ఆధార్ డాక్యుమెంటేషన్ అప్‌డేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. జనాభాకు తగ్గట్టుగా కేంద్రాలు లేకపోవడంతో ఒక్కో వ్యక్తి సుమారు 3 గంటల పాటు నిరీక్షిస్తున్నారు. సెంటర్లతో పాటు ఇంట్లో కూర్చుని ఫోన్‌లోనే ఉచితంగా అప్‌డేషన్ చేసుకునేలా కేంద్ర మంత్రిత్వ ఎలక్ట్రానిక్, ఐటీ శాఖ కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చింది. హెచ్‌టీటీపీ/మైఆధార్.యూఐడీఏఐ.జీఓవీ.ఇన్‌లో ఆధార్ పోర్టల్‌లో అప్‌డేషన్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌లో ఆధార్ పోర్టల్‌లో లాగిన్ అయిన తర్వాత, ఓటీపీ వస్తుంది. ఓటీపీ పూర్తి చేసిన తర్వాత, అందులో ఇంటిపన్ను రసీదు లేదా బ్యాంకు ఖాతా, ఉద్యోగులైతే ఐడెంటిటీ కార్డు (చిరునామా గుర్తింపు)తో డాక్యుమెంటేషన్ అప్‌డేట్ చేసుకోవాలి. 2015కు ముందు ఆధార్ దిగిన వారితో పాటు చిన్న తనంలో కార్డు తీసుకున్న పిల్లలు, వేలి ముద్రలు రాని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒక వేళ ఆధార్ కార్డులో ఫొటో మార్చుకోవాలని భావిస్తే, తప్పనిసరిగా ఆధార్ సెంటర్‌కు వెళ్లాలి.

సద్వినియోగం చేసుకోవాలి..



జిల్లా ప్రజలు ఆధార్ డాక్యుమెంటేషన్ అప్డేట్ గడువు పెంపును సద్వినియోగం చేసుకోవాలి. ఆధార్ సెంటర్లు, ఈ సేవా, బ్యాంకులతో పాటు కొత్త స్మార్టు ఫోన్‌లో చేసుకునే అవకాశం కల్పించారు. ఫోన్‌లో ఆధార్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి, ఓటీపీ వచ్చిన తర్వాత, డాక్యుమెంటేషన్ అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్ సెంటర్లలో మాత్రం రూ.50 మాత్రమే ఇవ్వాలి. అదనంగా వసూళు చేస్తే తమకు ఫిర్యాదు చేయవచ్చు.

-దుర్గారావు, ఈ డిస్ట్రిక్ మేనేజర్

అన్ని వర్గాలను స్వాగతిస్తాం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తలు

దేవరుప్పుల: రాష్ట్ర స్థాయి నుంచి దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలో బీఆర్ఎస్‌లోకి అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి క్వార్టర్స్‌లో కోలుకొండకు చెందిన బీసు వెంకటేశ్వర్లు, సంపత్ నాయకత్వంలో కాంగ్రెస్, టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుర్నాల రవి, కోతి ప్రవీణ్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా మీడియా కోఆర్డినేటర్‌గా చల్లా



జనగామ: జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ మీడియా కో ఆర్డినేటర్‌గా చల్లా ఉపేందర్ రెడ్డిని నియమిస్తూ స్టేట్ మీడియా ఇన్‌చార్జ్ వరుణ్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్‌కు చెందిన ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ తనపై నమ్మకం ఉంచి, అప్పగించిన బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తిస్తానన్నారు. ఈ ఎన్నికకు సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా

- కలెక్టర్‌పై ఈసీకి ఫిర్యాదు



ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన పత్రాలను చూపుతున్న నాయకులు

జనగామ: జిల్లా కేంద్రం అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్యపై కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం బీఎస్పీ, యువజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మెయిల్, రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు వంగాల మల్లారెడ్డి, సీపీఐ ప్రతినిధి మంగళపల్లి జనార్దన్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేరిపోతుల కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ వచ్చే శాసనసభ ఎన్నికల సమయంలో ఎన్నికల అధికారిగా కలెక్టర ఉంటే సజావుగా జరిగే అవకాశం లేదన్నారు. ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ కొంత మందితో తన ఉనికిని కాపాడుకునేందుకు తమపై ప్రకటన చేయిస్తున్నారన్నారు. ఉద్యోగ సంఘాల పేరుతో కొంతమంది ఏం చేస్తున్నారో తమకు తెలుసని, త్వరలోనే వారి అసలు నిజం బయట పెడతామన్నారు. కలెక్టర్ కేవలం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లెల్ల సిద్దారెడ్డి, బనుక శివరాజ్ యాదవ్, సీర్మాల రత్నం, బక్క మారయ్య, నీలాద్రి, తుర్కపల్లి కుమార్, ఇరుగు మహేందర్, రాపర్తి రాజు, జోగు ప్రకాష్, దడిగ సందీప్, దూసరి నాగరాజు, కోయల్ కార్ తదితరులు ఉన్నారు.

అశాస్త్రీయంగా ఐఆర్

జనగామ: ప్రభుత్వం ఉద్యోగ పక్షపాతిగా ఉంటూ, సీఎం కేసీఆర్ ప్రకటించిన పీఆర్‌సీని స్వాగతిస్తూనే అశాస్త్రీయంగా ప్రకటించిన ఐదు శాతం మధ్యంతర భృతి(ఐఆర్)ను వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.మహేందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పెద్ది హరి బాబు, రాష్ట్ర కార్యదర్శి ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి, జనగామ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మహబూబ్‌రెడ్డి, కె.జగదీశ్వరాచారి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన డీఏలు రాకపోగా, ఐఆర్ అశాస్త్రీయంగా ఉందని తెలిపారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

5 శాతం సరికాదు

జనగామ రూరల్: ఉపాధ్యాయులతో చర్చించకుండా ఏకపక్షంగా ఐఆర్ 5 శాతం ప్రకటించడం సరికాదని దీనిని యూఎస్‌పీసీ తీవ్రంగా ఖండిస్తుందని స్టీరింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ రావు అన్నారు. మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి పాఠశాలలకు హాజరై నిరసన తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యం..

● ప్రైవేట్ హెల్పర్‌కు కరెంట్ షాక్.. తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన కిరణ్

రఘునాథపల్లి: విద్యుత్ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రైవేట్ హెల్పర్‌కు కరెంట్ షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కంచనపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మంగళవారం సాయంత్రం విద్యుత్ లైన్‌మెన్ సోమయ్య స్థానిక సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న జేఎల్‌ఎం వీరస్వామికి సమాచారం ఇచ్చి ఎల్‌సీ తీసుకుని గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేయిస్తున్నాడు. ప్రైవేట్ హెల్పర్ భాస్కుల్ కిరణ్‌తో బీసీ కాలనీలో పనులు చేయిస్తున్నారు. అయితే పని పూర్తికాకముందే సబ్‌స్టేషన్‌లోని జేఎల్‌ఎం లైన్‌ఆన్ చేయడంతో కిరణ్ కరెంట్ షాక్‌కు గురై తీగలపైనే తలకిందులై తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు గుర్తించి సబ్‌స్టేషన్‌కు సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. తీవ్ర గాయాలైన కిరణ్‌ను కిందకు దింపి హుటాహుటిన జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు. లైన్‌మెన్, జేఎల్‌ఎం నిర్లక్ష్యంపై స్థానికులు సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. ఘటనపై ఏఈ రాహుల్‌ను వివరణ కోరగా ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రమేష్(ఫైల్)

దామెర: అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో జరిగింది. గ్రామానికి చెందిన వంగ రమేష్(35) తన కున్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ సంవత్సరం పత్తిపంట సాగు కోసం, తన ఇద్దరి పిల్లల చదువు కోసం రూ.3 లక్షల 50 వేలు అప్పు చేశాడు. అయితే అప్పుకు వడ్డీ చెల్లించలేక, అప్పు తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం తన వ్యవసాయబావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు!

● కేయూ విద్యార్థి జేఏసీ నాయకుల ఆరోపణ
● లిఖితపూర్వకంగా పోలీస్ కమిషనర్ దృష్టికి..
● మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో పెట్టాలని డిమాండ్



ఇష్టానుసారంగా..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల రెండో కేటగిరీలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రధానంగా వివిధ విభాగాల్లో పార్ట్‌టైం అభ్యర్థులకే ఎక్కువ సీట్లు ఇచ్చారని, రెగ్యులర్ అభ్యర్థులకు తక్కువ ఇచ్చారని విద్యార్థి జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఏదేని విభాగంలో 25 శాతం పార్ట్‌టైం, 75 శాతం ఫుల్‌టైం అభ్యర్థు లకు అడ్మిషన్లు కల్పించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అధికారులు బేఖాతర్ చేసినట్లు ఆరోపిస్తున్నారు. న్యాయ విచారణ జరిపించాలని కూడా కేయూ దూరవిద్య కేంద్ర ఆవరణలో నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న విషయం విదితమే.

పోలీస్ కమిషనర్ దృష్టికి..

ఇటీవల విద్యార్థి జేఏసీ నాయకులతో సీపీ రంగనాథ్ సమావేశం నిర్వహించారు. ఇందులో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఆరోపణలను లిఖితపూర్వకంగా రాసిస్తే వీసీ దృష్టికి తీసుకెళ్తానని సీపీ విద్యార్థి నాయకులకు సూచించారు. దీంతో పలు అంశాలను విద్యార్థి జేఏసీ నాయకులు కొన్ని పేజీల రిపోర్టులు సమర్పించారని సమాచారం. అందులో కొన్ని అంశాలను ఆరు రోజుల క్రితం కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..

ఇష్టానుసారంగా..

పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో వీసీ తన ఇష్టానుసారంగా కొందరికి అడ్మిషన్లు వచ్చేలా వ్యవహరించారని, యూజీసీ నిబంధనలు మార్చుకుని డీఆర్‌సీని కాదని, ఒక కొత్త అడ్మిషన్ కమిటీని ఇంటర్వ్యూ కోసం వివిధ విభాగాలను తయారు చేసి, తాను ఆమోదించిన ఆ కమిటీలతో ఇంటర్వ్యూలు నిర్వహించారని సీపీకి అందించిన లేఖలో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధం..

కంప్యూటర్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో ఇంటర్వ్యూల్లో ఆ విభాగపు సూపర్‌వైజర్‌ను ఇంటర్నల్ ఎక్స్‌పర్ట్ కింద ఉంచలేదు. వేరే విభాగపు సూపర్‌వైజర్‌ను కమిటీలో ఉంచడం నిబంధనలకు విరుద్ధం. అంతేకాకుండా ఇద్దరూ వేరే యూనివర్సిటీ వాళ్లను ఎక్స్‌టర్నల్ ఎక్స్‌పర్ట్‌లుగా నియమించారు. మెరిట్ విద్యార్థులకు సీట్లు రాకుండా నష్టం చేశారని, పలు విభాగాల అడ్మిషన్ కమిటీ ఆర్డర్‌లను బయట పెడితే నిజాలు బయటపడతాయని, ఈ కమిటీ ఆర్డర్లను యూనివర్సిటీ గోప్యంగా ఉంచడంలో ఆంతర్యమేంటని లేఖలో ప్రశ్నించారు.

ఈడబ్ల్యూఎస్ కోటా ఎలా వచ్చింది?

అభ్యర్థులు అప్లికేషన్ నింపేటప్పుడు లేని ఈడబ్ల్యూఎస్ కోటా ఇంటర్వ్యూలో ఎలా రప్పించారని సీపీకి అందించిన లేఖలో విద్యార్థులు ప్రశ్నించారు. బయోటెక్నాలజీ విభాగంలో, బీసీ కేటగిరీ కింద ఓ మహిళా అభ్యర్థికి 51, మరో మహిళకు 46, మరొకరికి 44 మార్కులు వచ్చాయి. వీరిలో ఎవ్వరినీ ఎంపిక చేయకుండా 43 మార్కులు ఉన్న మరో మహిళా అభ్యర్థిని ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో బీసీ–బీ కేటగిరీ కింద 65 మార్కులతో రెండో టాపర్ ఏ మహిళా అభ్యర్థిని కాదని, 52 మార్కులతో పురుష అభ్యర్థిని ఎంపిక చేశారని లేఖలో నిలదీశారు. ఇంకా పలు అంశాలను సీపీకి అందించిన లేఖలో పేర్కొన్నట్లు, ప్రవేశ పరీక్ష మార్కులు, ఇంటర్వ్యూ మార్కుల మెరిట్ జాబితాను పేర్లతో సహా.. వెబ్ సైట్‌లో పొందుపర్చాలని కోరినట్లు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి యాదవ్ తెలిపారు.

సై అంటే.. సై



పతకాలు సాధించిన క్రీడాకారులతో విద్యుత్ శాఖ అధికారులు

● హోరాహోరీగా విద్యుత్ ఉద్యోగుల క్రీడలు
● తమిళనాడు అథ్లెట్ల హవా
● మొదటిరోజు పోటీలు ఉత్కంఠ

హన్మకొండ: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ కోసం విద్యుత్ ఉద్యోగుల మధ్య పోరు హోరాహోరీగా కొనసాగుతోంది. తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమైన క్రీడా పోటీలు మంగళవారం ఉత్కంఠగా కొనసాగాయి. టీఎస్‌ఎన్పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ వెంకటేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మొదటి రోజు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. 200, 800 మీటర్ల రన్నింగ్, హ్యామర్‌త్రో, షాట్‌పుట్, 400 మీటర్ల హర్డిల్స్, లాంగ్‌జంప్‌తో పాటు బాల్‌బ్యాడ్మింటన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు తలపడ్డారు. తమిళనాడు క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో దూసుకుపోతూ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి ముందంజలో ఉన్నారు. బాల్ బాడ్మింటన్ క్రీడలు లీగ్ దశలో కొనసాగుతున్నాయని టీఎస్ ట్రాన్స్‌కో క్రీడల అధికారి జగన్నాథ్ తెలిపారు. క్రీడా పోటీల్లో తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్, ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ సంస్థ, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డ్, తమిళనాడు ఎలక్ట్రిసిటీ , ఉత్తర్‌ప్రదేశ్ పవర్ సెక్టార్ల నుంచి 12 జట్లు, 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్‌వడివేలు, వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి జాన్సన్, కౌన్సిల్ సభ్యులు పి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు..

200 మీటర్ల రన్నింగ్
బాలాజీ (గోల్డ్) ఏపీ, దినేష్(సిల్వర్) తమిళనాడు, రాజేష్(బ్రాంజ్) కేరళ.

800 మీటర్ల రన్నింగ్ ..
నాగులు(గోల్డ్) ఏపీ, సుందర్(సిల్వర్) తమిళనాడు, బాబు(బ్రాంజ్) తమిళనాడు.

400 మీటర్ల హర్డిల్స్
బాలమురుగన్(గోల్డ్) తమిళనాడు, యువరాజ్(సిల్వర్) తమిళనాడు, సతీష్(బ్రాంజ్)ఏపీ.

హ్యామర్‌త్రో
పాండ్యన్(గోల్డ్) తమిళనాడు, విజయ్‌కుమార్ (సిల్వర్) ఉత్తర్‌ప్రదేశ్, శ్రవణ్‌కుమార్ (బ్రాంజ్) ఉత్తర్‌ప్రదేశ్.

షాట్‌పుట్
శ్రీనివాస్(గోల్డ్) ఏపీ, రాజేశ్‌కుమార్(సిల్వర్) కేరళ, ముఖేష్(బ్రాంజ్) తమిళనాడు.

లాంగ్‌జంప్
రాజేష్(గోల్డ్) కేరళ, దినేష్(సిల్వర్) తెలంగాణ, విజయ్‌కుమార్(బ్రాంజ్) తమిళనాడు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు



హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎస్.వి.వేణుగోపాలచారి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లోకల్ కోర్టు నిర్వహిస్తామని, వినియోగదారులు ఈ కోర్టులో ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 4న తొర్రూరు డివిజన్ నెల్లికుదురు సెక్షన్ కార్యాలయంలో లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో దంతాలపల్లి, మునగలవీడు, నెల్లికుదురు సెక్షన్ కార్యాలయ పరిధిలోని వినియోగదారులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. నర్సంపేట డివిజన్ చెన్నారావుపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈ నెల 5న లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో అలంఖానిపేట, చెన్నారావు పేట, నెక్కొండ సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చని తెలి పారు. ఈ నెల 12న ములుగు డివిజన్ వాజేడు సబ్ స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టు ద్వారా ఎస్.వి.పురం, వాజేడు, ఈ నెల 13న జనగామ డివిజన్ రఘునాథపల్లి సబ్ స్టేషన్‌లో నిర్వహించే లోకల్ కోర్టులో నర్మెట, ఖిలాషాపూర్, రఘునాథపల్లి, తరిగొప్పుల సెక్షన్ కార్యాలయాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులు అందించి సమస్యలు పరిష్కరించుకోవాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎస్.వి.వేణుగోపాలచారి కోరారు.

కబ్జాపై కదిలిన యంత్రాంగం..

● భూమి చుట్టూ కంచె ఏర్పాటుకు నిర్ణయం
● కబ్జాదారులపై క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..


కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న సొసైటీ అధికారులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భూమి కబ్జా అంశాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించారు.'సర్కార్ భూమి స్వాహా' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు సొసైటీ అధికారులు స్పందించారు.ఈ మేరకు మంగళవారం జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ మేరకు భూమి కబ్జాకు గురైందని చైర్మన్ రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. 2022 జనవరిలో రెండెకరాల భూమిని సొసైటీకి కేటాయించిన పత్రాలను అధికారులకు చూపించారు. కొంతమంది కబ్జాదారులు సొసైటీ భూమిలోకి ఆక్రమించారని వివరించారు. బడా లీడర్ల హస్తంతో భూమికబ్జాకు గురైనట్లు స్థానికులు అధికారులకు చెప్పారు.

భూమి చుట్టూ కంచె ఏర్పాటు

కాగా,సొసైటీకి కేటాయించిన రెండెకరాల భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు పాలక వర్గానికి సూచించారు. సొసైటీ నిధులు వెచ్చించాలని చెప్పారు. ఇదిలా ఉండగా, కబ్జాదారులపై క్రిమినల్ చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సతీష్(ఫైల్)

భూపాలపల్లి అర్బన్: ద్విచక్రవాహనం అదుపు తప్పి కల్వర్ట్‌కు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి వేశాలపల్లి గ్రామ సమీపంలో జరిగింది. వేషాలపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో నివాసముంటున్న బైరి సతీష్ (34) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై భూపాలపల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపంలోని కల్వర్ట్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు.

కేయూలో బంద్ ప్రశాంతం..

● పరిపాలనాభవనం వద్ద విద్యార్థుల ధర్నా
● ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం


పరిపాలనా భవనం వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ టి శ్రీనివాస్‌రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి జేఏసీ ఇచ్చిన కాకతీయ యూనివర్సిటీ బంద్ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు క్యాంపస్‌లోని వివిధ కళాశాలలు, విభాగాలు తిరుగుతూ తరగతి గదుల్లోని విద్యార్థులను బయటకు పంపారు. అలాగే, ఉద్యోగులను కూడా పంపారు. దీంతో కేయూలో పాలన స్తంభించింది. అనంతరం వివిధ విభాగాల విద్యార్థులతో కలిసి ర్యాలీగా పరిపాలనాభవనం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై ప్రశ్నించిన విద్యార్థులను పోలీసులతో కొట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై తాము 46 పేజీల బుక్‌లెట్ విడుదల చేశామన్నారు. ఇప్పటికే పలు అంశాలను వరంగల్ పోలీస్‌కమిషనర్ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. వాటిపై వీసీ, రిజిస్ట్రార్లు బహిరంగ చర్చకు రావడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుపతి యాదవ్, నేతలు మందవీరస్వామి, రంజిత్‌కుమార్, రాంబాబు, మనోహర్, నాగరాజు, శంకర్, పాషా, రాజేష్, ప్రశాంత్, జగన్, రమేష్, విజయ్, రాజునాయక్, ప్రసాద్, సాయిరాం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలను ఉధృతం చేయాలి

● ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్


మాట్లాడుతున్న అశోక్

వరంగల్ చౌరస్తా : వర్గ, సామాజిక, జమిలి పోరాటాలను ఉధృతం చేయడమే అమరులకు ఇచ్చే ఘన నివాళి అని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం దివంగత పరికరాల భూమయ్య, పిట్ట వెంకటయ్య, సింగిరెడ్డి కొంరయ్య సంస్మరణ సభ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన వరంగల్ శివనగర్‌లోని ఓంకార్ భవన్‌లో జరిగింది. ఈ సంస్మరణ సభకు అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరికరాల భూమయ్య ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకుడిగా, నేరేడుపల్లి ఎంపీటీసీగా పని చేశారన్నారు. చనిపోయే వరకు నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడిన వ్యక్తి భూమయ్య అన్నారు. కార్మిక నాయకుడిగా పిట్ట వెంకటయ్య, రైతు ఉద్యమ నాయకుడిగా సింగిరెడ్డి కొంరయ్య సేవలు మరవలేనిన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, సుకన్య, గోనె కుమారస్వామి, ఎన్ రెడ్డి హంసా రెడ్డి, తుకారాం నాయక్, మంద రవి, గడ్డం నాగార్జునా, నర్ర ప్రతాప్, జబ్బార్ నాయక్, శ్రీనివాస్, వంగల రాగసుధ, నీల రవీందర్, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, కుసుంబ బాపురావు, గుండెబోయిన చంద్రయ్య, నాగెల్లి కొమరయ్య, గాదె మల్లేష్ ,కంచ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సముచిత స్థానమివ్వాలి

● ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్వీ విద్యార్థి ఉద్యమ నేతల డిమాండ్


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్వీ విద్యార్థి ఉద్యమ నేతలు

కేయూ క్యాంపస్ : 'తెలంగాణ రాష్ట్ర సాధనలో అప్పటి టీఆర్‌ఎస్వీ, ఇప్పటి బీఆర్‌ఎస్వీ విద్యార్థి నేతలు కీలక పాత్ర పోషించి అనేక కేసుల పాలై జైళ్లకు వెళ్లాం.. కానీ రాష్ట్రం సాధించిన అనంతరం తమకు ఎలాంటి గుర్తింపు లభించడం లేదని, మాపై చిన్న చూపు ఎందుకంటూ' ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్వీ ఉద్యమ నేతలు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం కేయూలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చట్టసభలు, పదవులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఎందులో కూడా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి ఉద్యమ నేతలకు సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్, జెడ్పీటీసీ, ఇతర జిల్లా స్థాయి పదవుల్లో కూడా అవకాశం కల్పించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ సేవలను గుర్తించి వివిధ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమ నేతలు డాక్టర్ పాలకుల కొమురయ్య, కందుకూరి ప్రభాకర్, మాచర్ల శరత్‌చంద్ర, జెట్టి రాజేందర్, మేడారపు సుధాకర్, అరూరి రంజిత్, కె. అభినాష్, రాజీమనోజ్, నాగరాజు, నగేష్, లక్ష్మణ్‌గౌడ్, సుమన్‌రెడ్డి, మోటె చిరంజీవి, విష్ణువర్ధన్, సాయిళ్ల రాజు, నీల అశోక్, రమేష్, తిరుపతి, క్రాంతికుమార్, ఎన్. సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికలు


రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపిక చేస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథం (ఎన్‌ఎస్‌ఎస్) కార్యాలయంలో మంగళవారం ప్రీ రిపబ్లిక్ పరేడ్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు హైదరాబాద్ నుంచి ఎన్‌ఎస్‌ఎస్ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ, స్టేట్ ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీస్ డిప్యూటీ ఎస్‌వో గీత, మరో అధికారి సంజయ్ హాజరయ్యారు. ప్రీ పరేడ్‌కు యూనివర్సిటీ పరిధిలోని వివిధ జిల్లాలకు చెందిన కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లలో ఐదుగురు బాలికలను ఎంపిక చేసినట్లు కేయూ ఎన్‌ఎస్‌ఎస్‌కోఆర్డినేటర్ ఈసం నారాయణ తెలిపారు. వీరు వచ్చే ఏడాది జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొంటారని తెలిపారు.

గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలి

● దేవాదాయధర్మాదాయశాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ శ్రీకాంతారావు
● ముగిసిన డీడీఎన్ అర్చకుల శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : అర్చకులు గ్రామరాజకీయాలకు దూరంగా ఉంటూ వేదధర్మం అనుసరిస్తూ ముందుకు సాగాలని, సిబ్బందితో ప్రతి మండలం, గ్రామంలో వెరిఫికేషన్ బృందాలు ఏర్పాటు చేస్తామని దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ టి. శ్రీకాంతారావు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల ధూపదీప నైవేద్య (డీడీఎన్)అర్చకులకు ఏర్పాటు చేసిన పునశ్చరణ తరగతులు ముగిశాయి. తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన ముగింపు సమావేశంలో శ్రీకాంతారావు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో డీడీఎన్ అర్చకులు దేవాలయాల తాళాలు తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్చకులు రోజూ ఉదయం వారి దేవాలయాల నుంచి లోకేషన్ షేర్ చేయాలని, దీనికోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వేదపండితుల ఆధ్వర్యంలో శైవ, వీరశైవ, స్మార్థ, పాంచరాత్ర, చాత్తాదవైష్ణవ, వైఖానస, గ్రామదేవత, తంత్రసార తదితర ఎనిమిది ఆగమాలలో అర్చకులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్లు రామల సునీత, శేషభారతి, సిబ్బంది వీరస్వామి, కవిత, సంజీవరెడ్డి, అనిల్‌కుమార్, అర్చక బోర్డు సభ్యులు చిలకమర్రి శ్రవణకుమార్‌చార్యులు, కృష్ణమాచారి, వేదపండితులు రామశర్మ, లంకాశివకుమార్‌శర్మ, పార్థసారధి, రత్నాకర్, రాఘవాచారి పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల కోసం వాక్‌ఇన్ అడ్మిషన్లు

వరంగల్ : రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ జుమ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2023 సెషన్ కోసం ఎన్‌సీవీటీ పద్ధతిలో వివిధ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్లలో శిక్షణ పొందడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో నాలుగు విడతల్లో జరిగిన కౌన్సింగ్‌లో మిగిలిన సీట్ల కోసం 5వ విడత వాక్‌ఇన్ అడ్మిషన్ల కోసం www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ విడత వాక్‌ఇన్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు ఈనెల 8 చివరి తేదీ అని తెలిపారు. ఆన్‌లైన్‌లో మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ వాక్ ఇన్ ఇంటర్వ్యూలను ఈనెల 9వ తేదీన ములుగు రోడ్డు సమీపంలో ప్రభుత్వ ఐటీఐ కాలేజీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.